సాయివీర్

నేవీకి ఎంపికైన ఎన్‌సీసీ క్యాడెట్‌లు

సుల్తాన్‌బజార్, మార్చి 11 : నేవి ఎస్ఎస్ఆర్ అధికారులుగా సైఫాబాద్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్‌లు సాయివీర్,రాజ్‌కుమార్ ఎంపికయ్యారు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌నాయక్, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ పల్లాటి నరేశ్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల ప్రతిభను గుర్తించి తగిన ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని తెలిపారు.

రాజ్‌కుమార్

జీహెచ్ఎంసీ మహిళా ఉద్యోగులకు సన్మానం

సిటీబ్యూరో, మార్చి 11 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం సీపీఆర్వో సెక్షన్‌లో మహిళా ఉద్యోగులు శైలజా, పద్మ, లతలను సీపీఆర్వో మహమ్మద్ ముర్తుజా, ఏపీఆర్వో జీవన్‌కుమార్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో రమేశ్, సీనియర్ అసిస్టెంట్స్ మహమ్మద్ మోహిసిన్, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

గిర్రున తిరుగుతున్న.. విద్యుత్ మీటర్లు..!

గ్రేటర్‌లో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం

- మార్చి మొదటి వారంలోనే 70.71 మిలియన్ యూనిట్లు
- గతేడాదికంటే 18 మిలియన్ యూనిట్లు అధికం
- ఏప్రిల్, మే నెలల్లో మరింత పెరిగే అవకాశం

సిటీబ్యూరో, మార్చి 11 (నమస్తే తెలంగాణ) : వేసవి తీవ్రత పెరగకముందే విద్యుత్ వినియోగం రికార్డు స్థాయిలో నమోదవుతున్నది. ఈ ఏడాది వేసవి సీజన్ ప్రారంభం నుంచే విద్యుత్ వినియోగం గతేడాది కంటే ఎక్కువగా నమోదవుతూ వస్తున్నది. తాజాగా మార్చి మొదటి వారంలో ఏకంగా ఒక రోజు విద్యుత్ వినియోగం 70.71 మిలియన్ యూనిట్లు (7.07 కోట్లు)గా మార్చి 7వ తేదీన అత్యధికంగా నమోదైందని అధికారులు తెలిపారు. అదే సమయంలో గతేడాది మార్చి 5వ తేదీన అత్యధికంగా 52.15 మిలియన్ యూనిట్లు (5.21 కోట్లు)గా నమోదు కాగా, అత్యధిక విద్యుత్ డిమాండ్ 2472 మెగావాట్లు ఉంది. ఏడాది వ్యవధిలోనే 1.2కోట్ల యూనిట్ల వినియోగం పెరిగింది. ఏప్రిల్, మే నెలల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉండడంతో విద్యుత్ 8 కోట్ల యూనిట్ల నుంచి 9 కోట్ల దాకా పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు అంచనా వేస్తున్నారు. రికార్డు స్థాయిలో పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా క్షేత్ర స్థాయిలో వేసవి కార్యచరణ చర్యలు చేపట్టామని, అదనంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు, కొత్త లైన్లు, సబ్ స్టేషన్‌ల వద్ద పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ముఖ్యంగా గ్రేటర్ పరిధిలో, సైబర్ సిటీ సర్కిల్ పరిధిలోని పట్టణ ప్రాంతంతో పాటు శివారు ప్రాంతాల్లోనూ నివాస ప్రాంతాలకు తోడు పరిశ్రమలు కొత్తగా ఏర్పాటవుతుండడంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్నదని అధికారులు పేర్కొంటున్నారు. అదేవిధంగా గ్రేటర్ శివారు ప్రాంత సర్కిళ్లు అయిన కుత్బుల్లాపూర్, మేడ్చల్, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, హబ్సిగూడల్లోనూ విద్యుత్ వినియోగం బాగా పెరిగిందని అధికారులు తెలిపారు.

2024 మార్చి మొదటి వారంలో విద్యుత్ వినియోగం ఇలా...

తేదీలు	డిమాండ్ (మెగావాట్లు)	వినియోగం (మిలియన్ యూనిట్లు)
7	3373	70.71
8	3296	70.26
9	3114	66.57
10	2953	63.19

అవసరమైనంత ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యం

న్యూట్రిషనిస్ట్ రుజుతా దివేకర్

బంజారాహిల్స్‌లోని తాజ్ దక్కన్ హోటల్‌లో ఎఫ్ఎల్‌వో ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న న్యూట్రిషనిస్ట్ రుజుతా దివేకర్, ఫిక్కీ లేడీస్ సభ్యులు

బంజారాహిల్స్, మార్చి 11 : శరీరానికి అవసరమైనంత ఆహారాన్ని మాత్రమే తీసుకోవడంతో పాటు తమ ప్రాంతంలో లభించే సీజనల్ పండ్లు, కూరగాయలను ఖచ్చితంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని న్యూట్రిషనిస్ట్ రుజుతా దివేకర్ అన్నారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని తాజ్ దక్కన్ హోటల్‌లో సోమవారం సాయంత్రం 'ది 40 మంత్ర' పేరుతో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రుజుత దివేకర్ మాట్లాడుతూ.. 40ఏళ్లు వచ్చాయంటే వయసు అయిపోతుందనే ఆందోళన పడుతుంటారని, అలాంటి ఆలోచనలకు దూరంగా ఉంటూ పద్ధతి ప్రకారం ఆహారపు అలవాట్లను కొనసాగిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఫిక్కీలేడీస్ ఆర్గనైజేషన్ చైర్ పర్సన్ రితూ షాతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

టీఎన్జీవో కేంద్ర సంఘం నూతన అధ్యక్షుడిగా మారం జగదీశ్వర్

జగదీశ్వర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కేంద్ర సంఘం నాయకులు, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు

సుల్తాన్‌బజార్, మార్చి 11 :టీఎన్జీవో కేంద్ర సంఘం నూతన అధ్యక్షుడిగా మారం జగదీశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అన్ని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కేంద్ర కార్యవర్గ సభ్యులు ప్రస్తుతం ఉన్న టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు మారం జగదీశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వంతో చర్చించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌కు టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకట్, ముత్యాల సత్యనారాయణ గౌడ్, కోశాధికారి రామినేని శ్రీనివాస్ రావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, టీఎన్జీవో నగర శాఖ కట్కూరి శ్రీకాంత్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా సాధికారతకు జీహెచ్ఎంసీ నిదర్శనం

అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సిటీబ్యూరో, మార్చి 11 (నమస్తే తెలంగాణ) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, గీతా మాధురి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, తదితరులు పాల్గొన్నారు. మహిళలకు సాటి మహిళలేనని, ఒకరికొకరు సపోర్టు చేసినప్పుడు మహిళ అభ్యున్నతి సాకారమవుతుందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. అన్ని రంగాల్లో మహిళలు మగవారికంటే ముందంజలో ఉన్నారని తెలిపారు. మహిళా సాధికారతకు జీహెచ్ఎంసీ నిదర్శనమన్నారు. సావిత్రిబాయి పూలే, ఫాతిమా, ఇందిరాగాంధీ మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని మహిళలు చైతన్యవంతం కావాలని పేర్కొన్నారు. మహిళలు మగవారితో సమానంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని అడిషనల్ కమిషనర్ నళిని పద్మావతి పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ గీతా మాధురి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. అంతకు ముందు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. 15మంది శానిటేషన్ కార్మికులను సన్మానించారు. ఆ తర్వాత శానిటేషన్ కార్మికులతో కలిసి మేయర్ సహా పంక్తి భోజనం చేశారు. ఈ సహపంక్తి భోజనంలో డిప్యూటీ మేయర్, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, అడిషనల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

కల్పవృక్ష వాహనంపై శ్రీవారి ఊరేగింపు

బంజారాహిల్స్, మార్చి 11 : జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం కల్పవృక్ష వాహన సేవ నిర్వహించారు. స్వామివారిని కల్పవృక్ష వాహనంపై మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు కోరుకున్న కోర్కెలు తీర్చే కల్పవృక్షంపై శ్రీనివాసుడిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. సాయంత్రం స్వామివారిని సర్వ భూపాల వాహనంపై ఊరేగించారు.

మల్కాజిగిరి బరిలో వైష్ణవి ప్రసాద్

ఏకగ్రీవ తీర్మానం చేసిన బ్రాహ్మణ సంఘాలు

మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం స్వతంత్ర్య అభ్యర్థిగా వైష్ణవి ప్రసాద్ పేరును తీర్మానించి తమ ఐక్యతను చాటుతున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

ఎల్బీనగర్, మార్చి 11 : అన్ని వర్గాల ప్రజలకు సేవ చేసేందుకే మల్కాజిగిరి పార్లమెంటు బరిలో దిగుతున్నానని వైష్ణవి క్యాటరర్స్ అధినేత వైష్ణవి ప్రసాద్ అన్నారు. నాగోలు అనంతుల అంజిరెడ్డి గార్డెన్స్‌లో తెలంగాణ బ్రాహ్మణ సంఘాల ఆత్మీయ సమ్మేళనం, శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ అభ్యర్థిగా వైష్ణవి ప్రసాద్‌ను మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థిగా నిలపాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనంతరం వైష్ణవి ప్రసాద్ మాట్లాడుతూ బ్రాహ్మణ సంఘాల నాయకులు, బ్రాహ్మణ సోదర, సోదరీమణులు తనపై ఎంతో నమ్మకంతో మల్కాజిగిరి పార్లమెంటు బరిలో స్వతంత్ర్య అభ్యర్థిగా నిలపాలని నిర్ణయించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలో బ్రాహ్మణ ఓటర్లు కీలకమని, అన్ని సంఘాల ప్రతినిధులు ఒక్కతాటిపైకి వచ్చి గెలిపించాలని కోరారు. బ్రాహ్మణ సంఘం నాయకుడు దుడ్డు సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, అధ్యక్షులు మంగపతిరావు, దర్శనం శర్మ, తులసీ శ్రీనివాస్, జగన్మోహన్ శర్మ, బస్వరాజు శ్రీనివాస్, ఎంవీ శాస్త్రీ, నందిరాజు లక్ష్మీనారాయణ, వెంట్రాప్రగడ సుబ్బారావు, వక్కలంక శ్రీనివాస్ రావు, వారణాసి వంశీ, మంగు రాఘవరావు, శ్రీధర్ బాబు, యాదగిరి రావు, గోపీ కృష్ణమాచార్యులు, సీతారామయ్య, ముని పల్లె శ్రీనివాస్, గొల్లపూడి రాజేశ్వర్‌రావు, సోమయాజులు, ఏవీఎన్ మూర్తి, కల్పవల్లి, అనురాధ, భవాని, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

బిక్కికృష్ణ కవిత్వం యువతకు స్ఫూర్తిదాయకం

రవీంద్రభారతిలో మార్మికనది పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, మార్చి 11 : ప్రముఖ కవి, సీనియర్ పాత్రికేయులు, కళారత్న డా.బిక్కికృష్ణ రాసిన కవిత్వం యువతకు స్ఫూర్తిదాయకం కావాలని టీడీపీ నాయకులు టీడీ జనార్దన్ పేర్కొన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హైదరాబాద్ రవీంద్రభారతిలో శ్రీభం సాయి సేవా ట్రస్ట్, భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన బిక్కి కృష్ణ రాసిన మార్మికనది పుస్తకావిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బిక్కికృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో అతిథులుగా విశ్రాంత ఆదాయపు పన్ను చీఫ్ కమిషనర్ నరసింహప్ప, జస్టిస్ బి.చంద్రకుమార్, తెలుగు వన్ వ్యవస్థాపకులు కంఠంనేని రవిశంకర్, సినీదర్శకులు డా.ప్రభాకర్‌జైనీ, ప్రముఖ కవి డా.జెల్ది విద్యాధర్, కవయిత్రిలు డా.పి.విజయలక్ష్మి పండిట్, రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు జాతీయ మహిళా లెజెండరీ పురస్కారాలు అందజేశారు. మహిళాదినోత్సం నేపథ్యంలో నిర్వహించిన కవిసమ్మేళనం సభికులను అలరించింది.

మహిళాభివృద్ధికి సింగరేణి కృషి

జూబ్లీహిల్స్, మార్చి 11 : సింగరేణి కాలరీస్ కంపెనీ మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నదని జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) జి.దేవేందర్ పేర్కొన్నారు. నగరంలోని సింగరేణి భవన్‌లో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ క్రీడా, సాంస్కృతిక పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఎన్.భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అడిషనల్ జనరల్ మేనేజర్ ఎస్వీ.రాజశేఖర్, స్వరూప దేవేందర్, షర్మిల మోజెస్, లక్ష్మీ ప్రియ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్‌అదాలత్

నాంపల్లి కోర్టులు, మార్చి 11 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 16న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నాంపల్లి కోర్టుల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్‌రావు తెలిపారు. వివాహ సంబంధ, చెక్‌బౌన్స్, ఎక్సైజ్, ఐపీసీ సెక్షన్లతో నమోదైన కేసులు, రోడ్డు ప్రమాదాలు, తదితర కేసులను ఇరువర్గాలు రాజీ చేసుకుని సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలని తెలిపారు.

స్వల్పంగా తగ్గిన ఉష్ణోగ్రత

సిటీబ్యూరో, మార్చి 11 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో పగటి ఉష్ణోగ్రతలు 35.4డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24.6డిగ్రీలు, గాలిలో తేమ 37శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

విద్యుత్ సబ్ స్టేషన్లను తనిఖీచేసిన సీఎండీ

ఉన్నతాధికారులతో కలిసి నగరంలోని సబ్ స్టేషన్‌లను తనిఖీ చేస్తున్న దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

సిటీబ్యూరో, మార్చి 11 (నమస్తే తెలంగాణ): వేసవిలో విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు, నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) చర్యలు చేపట్టింది. ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలో భారీగా విద్యుత్ డిమాండ్ ఉన్న నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ పర్యటిస్తున్నారు. సోమవారం మెట్రో జోన్ పరిధిలోని సబ్‌స్టేషన్‌లను ఇన్‌చార్జి డైరెక్టర్ ఆపరేషన్స్, మెట్రో జోన్ సీజీఎం నరసింహులుతో కలిసి తనిఖీ చేశారు. సబ్ స్టేషన్ నిర్వహణ, పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లపై ఉన్న లోడ్, ఫీడర్ల నిర్వహణ అంశాలను పరిశీలించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని, విద్యుత్ సరఫరాలో విషయంలో అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

కమర్షియల్ ట్యాక్స్ పేరుతో మద్యం లారీలు సీజ్

మద్యం స్టాక్‌తో సీజ్ చేసిన వాహనాలను విడుదల చేయాలని ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకున్న బార్ అండ్ రెస్టారెంట్, వైన్స్ షాపుల యజమానులు.

- వెంటనే లారీలను విడుదల చేయాలి.. లేనిపక్షంలో కార్యాచరణ ప్రకటిస్తాం
- ఎక్సైజ్ శాఖ జేసీకి బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ వినతి

తెలుగు యూనివర్సిటీ, మార్చి 11 : మద్యం స్టాక్‌లకు వే బిల్లులు చూపాలని వారం రోజులుగా స్టాక్ ఉన్న లారీలను కమర్షియల్ ట్యాక్స్ అధికారులు పట్టుకొని సీజ్ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు విజయ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. నాంపల్లిలోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయానికి సోమవారం చేరుకున్న బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్, వైన్స్ అసోసియేషన్ యజమానులు కమిషన్ అందుబాటులో లేకపోవడంతో ఎక్సైజ్ శాఖ జేసీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ టీఎస్‌బీసీఎల్‌కు ట్యాక్సులు చెల్లిస్తున్నందున ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ పర్మిషన్ ఇస్తుంది కానీ ప్రస్తుతం కమర్షియల్ ట్యాక్స్ కొత్తగా తమను వేదింపులకు గురిచేస్తూ స్టాక్‌ను సీజ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి సీజ్ చేసిన స్టాక్ లోడ్ లారీలను విడుదల చేయాలని లేనిపక్షంలో భవిష్యత్తు కార్యాచరణ చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, రామకృష్ణ, పి.రాజుగౌడ్, సంజయ్‌రాజు గౌడ్, వెంకటేశ్వరరావు, రామచంద్రారెడ్డి, ప్రభు, సుభాష్, నర్సింహగౌడ్, సూరజ్, గోవింద్ గౌడ్ తదితరులు జేసీని కలిసి వినతి పత్రం అందజేశారు.

నగరవాసికి రూ.19లక్షలు టోకరా

సిటీబ్యూరో, మార్చి 11 (నమస్తే తెలంగాణ) : ముంబై కస్టమ్స్ అధికారులమంటూ సికింద్రాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.19.30 లక్షలు చోరీ చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన ఓ వ్యక్తికి ముంబై పోలీసులమంటూ ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు మీ పేరుపై వచ్చిన డీహెచ్ఎల్ పార్సిల్‌లో నిషేదిత పదార్థాలు ఉన్నాయని, సీబీఐ, ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం విచారించాలని బెదిరించారు. ఈ కేసుకు సంబంధించి క్లియరెన్స్, ఎన్ఓసీ జారీ చేయాలని రూ.19.30 లక్షలు బదిలీ చేయించుకున్నారు. తర్వాత వారు స్పందించక పోవడంతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంగపుత్రులను ఎంబీసీలో చేర్చాలి

డాక్టర్ వకుళాభరణంకు గంగపుత్ర డైరీని అందజేస్తున్న రాజేశ్ కన్నా

ఖైరతాబాద్, మార్చి 11 : సామాజిక, ఆర్థిక, రాజకీయంగా వెనుకబడిన గంగపుత్రులను ఎంబీసీలో చేర్చాలని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టంగుటూరి రాజేశ్ కన్నా కోరారు. సోమవారం ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావును మర్యాదపూర్వకంగా కలిసి వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరీని అందజేశారు.

హ్యాపీ ఉమెన్స్ డే..

బేగంపేటలోని పైగా ప్యాలెస్‌లో నిర్వహించిన ఉమెన్స్ డే వేడుకల్లో మహిళా ఉద్యోగులతో కలిసి పాల్గొన్న హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలి.

– సిటీబ్యూరో, మార్చి 11 (నమస్తే తెలంగాణ)

బరోడా పోలీస్ స్యాలరీ ప్యాకేజీ

జూబ్లీహిల్స్, మార్చి 11 : బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం సిబ్బందికి ''బరోడా పోలీస్ స్యాలరీ ప్యాకేజీ'' అందించేందుకు టీఎస్‌పీఎఫ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం సిబ్బందికి ఉచిత సమగ్ర వ్యక్తిగత ప్రమాద బీమా కవర్ (పీఏఐ), యోధా రిటైల్ లోన్లపై ప్రత్యేక ఆఫర్లతో పాటు డెబిట్.. క్రెడిట్ సేవలతో అనేక ప్రయోజనాలను అందించనున్నారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఐపీఎస్ అనిల్ కుమార్, బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్, హైదరాబాద్ జోనల్ హెడ్ రితేష్ కుమార్ ఒప్పంద పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఖాతాదారు విధి నిర్వహణలో మరణిస్తే రూ.1.30 కోట్లు, విధి నిర్వహణేతర సమయంలో మరణిస్తే రూ.1.26కోట్లు, శాశ్వత వైకల్యానికి గురైతే రూ.80 లక్షల వరకు వ్యక్తిగత ప్రమాద బీమాతో పాటు సేవలందిస్తున్న ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల వ్యక్తిగత బీమా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీఎఫ్ కమాండెంట్ ఎన్.త్రినాథ్, బీఓబీ ఏజీఎం అభిషేక్ భారతి, డిఫెన్స్ బ్యాంకింగ్ అడ్వైజర్, బ్రిగేడియర్ ఎస్‌కే.ప్రసాద్ (రిటైర్డ్) తదితరులు ఈ అవగాహన ఒప్పందంలో పాల్గొన్నారు.